క్లుప్తంగా

జాబ్‌మేళాకు స్పందన

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధికల్పన శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. పేటీఎం కంపెనీలో పనిచేసేందుకు నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 50 ఖాళీల కోసం ఉపాధి కల్పన కార్యాలయంలో మేళా నిర్వహించినట్లు ఎంప్లాయిమెంట్ అధికారి గోవర్ధన్ తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుని పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రతాప్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణితం (1) సబ్జెక్టులో ఖాళీ ఉందని అభ్యర్థులు సంబంధిత పీజీలో 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉన్నవారు అర్హులన్నారు. వివరాలకు 70759 99789 సంప్రదించాలన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఆదిలాబాద్‌రూరల్: 2025–26 విద్యా సంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 5వ తరగతిలోని ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో, 6వ తరగతి నుంచి 9వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాల సీవోఈ లలితా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో భర్తీ కోసం మూడు రోజులు మాత్రమే గడువు ఉందన్నారు.

వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో గల స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా అందించే వివిధ వృత్తి నైపుణ్య కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేంద్ర ఇన్‌చార్జి రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ మేకింగ్ (టైలరింగ్), కంప్యూటర్, సీసీటీవీ రిపేరింగ్, ఆర్‌అండ్ హెచ్‌సీ , సెల్‌ఫోన్ సర్వీసింగ్ వంటి కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు.

అనారోగ్యంతో రిటైర్డ్ తహసీల్దార్ మృతి


రాములు (ఫైల్)

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామానికి చెందిన రిటైర్డ్ తహసీల్దార్ కాదరి రాములు (82) అనారోగ్యంతో మంగళవారం ఆసిఫాబాద్‌లో మృతి చెందారు. ఆయన స్వగ్రామం వడూర్ కాగా, ఆసిఫాబాద్‌లో నివాసం ఉంటున్నారు. గతకొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించారు. మృతుడి స్వగ్రామమైన వడూర్ గ్రామానికి మృతదేహాన్ని తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండలంలోని జాతీయ రహదారి మన్నూరు గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మన్నూరు గ్రామానికి చెందిన కస్బె సంతోష్ (45) మృతి చెందాడు. సంతోష్ గుడిహత్నూర్ వైపు నుంచి మన్నూరు గ్రామానికి కాలినడకన వెళ్తుండగా మన్నూర్ గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన గల సర్వీస్ రోడ్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: దాడికి పాల్పడిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. బస్టాండ్ సమీపంలో సంజయ్‌నగర్‌కు చెందిన గులామ్ అక్బర్ పాన్‌షాప్ ఉండగా, ఆ షాపు విషయంలో ఖానాపూర్‌కు చెందిన ముజాహిద్‌తో గొడవ జరిగింది. ఈక్రమంలో అక్బర్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్సై తెలిపారు.

ఇరువురిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీసుస్టేషన్ పరిధి కేఆర్‌కే కాలనీకి చెందిన నేహా, బాలక్క ఇరువురిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్‌కే కాలనీలో బంధన్ బ్యాంక్‌లో 30 మంది సభ్యులు ఉంటారు. ఆ సభ్యుల్లో నేహా, బాలక్క రుణం విషయంలో మాటమాట పెరిగి పరస్పర దాడికి పాల్పడ్డారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుట్టలు మాయం..!

- విచ్చలవిడిగా తవ్వకాలు
- అక్రమంగా మట్టి తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు


మొరం తవ్వుతున్న జేసీబీ

నేరడిగొండ: వాల్టా చట్టం అధికారుల చుట్టంగా మారుతోంది. సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కుప్టి గ్రామ శివారులో జాతీయ రహదారికి ఆనుకొని ఒకప్పుడు పెద్ద గుట్ట ఉండేది. కానీ కొద్ది కాలం క్రితం గుట్టను తవ్వడం మొదలుపెట్టారు. గుట్ట నుంచి మట్టిని తవ్వడంతో ప్రస్తుతం పూర్తిగా ఆనవాళ్లు కోల్పోయింది. ఎటు చూసినా గుట్టపోయి గోతులు కనిపిస్తున్నాయి. మొదట్లో సుమారు 7 నుంచి 8 మీటర్ల ఎత్తులో గుట్ట ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

గుట్టల పరిస్థితి..

గుత్పాల, కుంటాల(కె), వడూర్, కొర్టికల్(బి), నారాయణపూర్ గ్రామాల శివారులో సైతం యథేచ్ఛగా మట్టిని తరలించడంతో గుట్టలు కనుమరుగవుతున్నాయి. గుట్టల నుంచి నిత్యం మట్టిని తరలిస్తుంటారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులకు అక్రమార్కుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కుప్టి ప్రాంతంలో తవ్వకాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి యథేచ్ఛగా మొరాన్ని తరలించుకుపోతున్నారు. మండలంలో ఎక్కడా వాల్టా చట్టం అమలు కావడం లేదని స్పష్టమవుతుంది.

మండల అధికారే.. మైనింగ్ అధికారి

నేరడిగొండ మండలానికి మైనింగ్ శాఖ ఏడీ రవీందర్ మండల ప్రత్యేకాధికారిగా ఉన్నారు. అయితే ఇదంతా జరుగుతున్నా ఆయన చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసైన్డ్ భూములను కొనుగోలు చేసి తవ్వకాలు జరుపుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై అధికారుల తీసుకెళ్లినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సాక్షి ఆయనను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

అధికారుల కనుసన్నల్లోనే తవ్వకాలు..

మండలంలోని కుప్టి జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న కుప్టి గుట్టలను భారీ యంత్రాలతో కొల్లగొడుతున్నారు. గతంలో కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు భారీ ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి గుట్టలను కొల్ల గొట్టారు. ఇదే అదునుగా తీసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలను రాత్రిపూట కొంత మంది వ్యాపారస్తులు తరలిస్తున్నారు. ఇలా ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేస్తున్నా సంబంధిత అధికారులు ‘మామూలు’గా తీసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు మేల్కొని గుట్టలు కనుమరుగు కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

‘మామూలు’గా తీసుకోవడంతోనే..



ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను విస్మరించి మామూలుగా తీసుకోవడంతోనే మొరం తవ్వకాలు చేస్తున్నారు. అధికారులకు సమాచారం ఇచ్చినా.. తమ దృష్టికి రాలేదంటూ చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు చేపట్టాలి.

– గడ్డం భీంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ, నేరడిగొండ

మొరం తరలిస్తే చర్యలు



మండలంలో మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. మొరం తరలించాలంటే ఆయా శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుంది. ఎక్కడైనా తవ్వకాలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలి.

– ఎంఏ కలీమ్, తహసీల్దార్, నేరడిగొండ

ఆదివాసీల అభ్యున్నతికి కృషి


పూజలు చేస్తున్న జోగు రామన్న

బేల: ఆదివాసీ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ వారి అభ్యున్నతికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని సదల్‌పూర్ భైరందేవ్, మహాదేవ్ ఆలయాలను ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు., ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదల్‌పూర్‌లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రూ.2 కోట్ల వ్యయంతో కమ్యూనిటీ హాల్‌లు, సీసీరోడ్లు, వంతెనలు నిర్మించినట్లు తెలిపారు. 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఆదివాసీల సంస్కృతి, ఆచారాలతో పాటు వారి సంక్షేమాన్ని ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మెట్టు ప్రహ్లాద్, సతీష్‌పవార్, దేవన్న, ప్రమోద్‌రెడ్డి, జక్కుల మధుకర్, బాలచందర్, తన్వీర్‌ఖాన్, కొడపే అరుణ్, ఆలయ కమిటీ చైర్మన్ కొరంగే శ్యాంరావు, కుషాల్‌రావు, జంగ్‌షా పాల్గొన్నారు.

నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు


వివరాలు తెలుసుకుంటున్న జడ్జి సౌజన్య

ఇంద్రవెల్లి: కేస్లాపూర్ నాగోబా ఆలయంలో డీఎల్ఎస్ఏ సెక్రటరీ సీనియర్ సివిల్ జడ్జి సౌజన్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులతో మాట్లాడి నాగోబా ఆలయ చరిత్ర, గంగా జలం పవిత్రత, నాగోబా సంప్రదాయ పూజలు, మహా పూజలు, జాతర నిర్వహణను అడిగి తెలుసుకున్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లీగల్ స్టాల్‌ను పరిశీలించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉట్నూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు జమీర్‌ఖాన్, బానోత్ జగన్‌నాయక్, జైవంత్‌రావ్, అశోక్, వినోద్, సిబ్బంది పాల్గొన్నారు.

‘సీపీఎస్‌ను రద్దు చేయాలి’


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాంసి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీపీఎస్, యూపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని పీఆర్టీయూ భీంపూర్ మండల అధ్యక్షుడు గంపల ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా శాఖ పిలుపు మేరకు భీంపూర్ మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని తహసీల్దార్ నలంద ప్రియకు వినతిపత్రం అందజేశారు. సీపీఎస్ విధానం వలన ఉపాధ్యాయులు నష్టపోతున్నారని వివరించారు. వెంటనే ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్, మహేందర్, రజిత పాల్గొన్నారు.

టీబీని నిర్మూలించడమే లక్ష్యం


వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: టీబీ మహమ్మారిని నిర్మూలించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెచ్ఈవో పవార్ రవీందర్ అన్నారు. మంగళవారం మండలంలోని తేజాపూర్ గ్రామస్తులకు టీబీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీబీ వ్యాధిని అంతమొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. వ్యాధి ముదిరితే మరణాలు సంభవించే అవకాశం ఉంటుందన్నారు. 27 మందికి సంబంధించి శాంపిళ్లను సేకరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవీందర్, సంతోష్, వైష్ణవి, రాణి, శ్రీనివాస్ రెడ్డి, సాయన్న, భూలక్ష్మి, గంగామణి, లక్ష్మి, భానుప్రియ, పుష్పల పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయమని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన మంగళవారం ‘సాక్షి’తో మాట్లాడారు. నియోజకవర్గంలో తారు రోడ్ల పునర్ నిర్మాణం కోసం రూ.15 కోట్ల 30 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు. గుడిహత్నూర్ మండలంలోని కామగిరి నుంచి సుంకిడి వయా బెల్లారి, తేజాపూర్ నుంచి గుడిహత్నూర్ వరకు రూ.7 కోట్ల 50 లక్షలు, నేరడిగొండ మండలంలోని 44వ జాతీయ రహదారి నుంచి బోరిగాం వరకు ఉన్న నాలుగు కిలో మీటర్ల తారురోడ్డు పునర్ నిర్మాణం కోసం రూ.2 కోట్ల 60 లక్షలు, ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు నుంచి చిన్నబుగ్గారం వరకు గల ఒక కిలో మీటరు తారు రోడ్డుకు రూ.65 లక్షలు, 44వ జాతీయ రహదారి నుంచి తర్నం(కె) 3 కిలో మీటర్లు గల రోడ్డుకు రూ.1 కోటి 95 లక్షలు, బోథ్ మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పొచ్చర గ్రామానికి 1 కిలో మీటర్ రోడ్డుకు రూ.65 లక్షలు, పీఆర్ రోడ్డు నుంచి గొల్లాపూర్ గ్రామానికి 3 కిలో మీటర్ల రోడ్డుకు రూ.1 కోటి 95 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని పేర్కొన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మహిళ సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ యశోద అన్నారు. మంగళవారం జైనథ్ మండల కేంద్రంలో బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమంపై అంగన్‌వాడీ ఆయాలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా బాలికలు, యువతులు, మహిళలను వేధింపులకు గురిచేస్తే 1098, 181 టోల్‌ఫ్రీ నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం నిర్వాహకురాలు సరస్వతి, కౌన్సిలర్ నాగమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, ముంతాజ్, న్యూట్రీషియన్ కన్సల్టెంట్ యోహాన్ పాల్గొన్నారు.

భజన పోటీలు ప్రారంభం

బేల: మండల కేంద్రంలోని శ్రీరామ మందిరం ప్రక్కన మైదానంలో మంగళవారం రాత్రి వీర్ హనుమన్ భవ్య కంజరి మండలి బేల వారి ఆధ్వర్యంలో భజన పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువులు, మహాత్ముల చిత్రపటాలకు నమస్కరించి, జ్యోతి ప్రజల్వనతో ఈ పోటీలను ఎస్సై దివ్యభారతి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భజన మండలి సభ్యులు పోటీలు నిర్వహిస్తూ సమాజంలో ఐక్యత, ఆధ్యాత్మిక బాటల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటు అందించడం అభినందనీయమన్నారు. భజన పోటీలు అంతర్రాష్ట్ర పురుష, తెలంగాణ, మహిళ, బాలల విభాగాల్లో 2 రోజుల పాటు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, మాజీ సర్పంచ్‌లు తేజ్‌రావు, ఇంద్రశేఖర్, రాకేశ్, భజన మండలి అధ్యక్షుడు ఉర్వతే సచిన్, ఉపాధ్యక్షుడు వన్కర్ వేంకటేశ్, ఉర్వతే కిశోర్, నైతం పురుషోత్తం, మెస్రం వాసుదేవ్, గోడం విఠల్, సుధాకర్ పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. మైనార్టీలు ఈద్గాలో పలు సమస్యలు, అదేవిధంగా మండల కాలనీవాసులు తమ కాలనీ సమస్యలు ఆడే గజేందర్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమిపూజ చేశారు. ఒక్క రోజులోనే తమ సమస్యలను పరిష్కరించిన ఆడే గజేందర్‌కు మైనార్టీలు, మండల కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు ఆడే వసంత్ రావు, ఏలేటి రాజు రెడ్డి, షేక్ వాజిద్, సయ్యద్ సాబిర్, ముఫ్తీ మోబీన్, మొహమ్మద్ మునీర్, సయ్యద్ అహ్మద్, షఫీ, పాషా, ఎంఏ రహీం, కలీమ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళిక రూపొందించాలి

ఎదులాపురం: ఆదివాసీల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని టీఏజీఎస్ రాష్ట్ర నాయకులు, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూసం సచిన్ అన్నారు. సంగారెడ్డిలో జరుగుతున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభల్లో జిల్లా ప్రతినిధిగా పాల్గొని ఆదివాసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై రిపోర్ట్ ప్రవేశ పెట్టారు.

బండి సంజయ్ ఫ్లెక్సీ దహనం

కైలాస్‌నగర్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను తక్షణమే పదవీ నుంచి భర్తరఫ్ చేయాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆయన ఫ్లెక్సీని దహనం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ భావజాలం కలిగిన వ్యక్తులకే పద్మశ్రీ అవార్డులను ఇస్తామన్నట్లుగా బండి సంజయ్ వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. వెంటనే క్షేమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు మేకల మల్లన్న, రాఘవేంద్ర, నరేందర్, రఘు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదిలాబాద్ రూరల్ ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ లక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలో ని లాండసాంగ్వి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, భోజనాన్ని, నిల్వ ఉన్న సరుకుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ప్రతీ రోజు వచ్చేలా చూడాలన్నారు. ఆమె వెంట అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, గర్భిణులు, బాలింతులు ఉన్నారు.

కుంభమేళా జలాన్ని భక్తులు స్వీకరించాలి

ఆదిలాబాద్: సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న మహాకుంభమేళా త్రివేణి సంగమ పవిత్ర జలాన్ని భక్తులు స్వీకరించాలని ఎంపీ గోడం నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో మంగళవారం సమితి సభ్యులు కుంభమేళా పవిత్ర జలాన్ని కమండలంలో ఆయనకు అందించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ 144 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మహా కుంభమేళ పవిత్ర జలాన్ని భక్తులకు పంపిణీ చేస్తుండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గేడం మాధవ్, సభ్యులు కందుల రవీందర్ పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్‌డే


నృత్యం చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే అలరించింది. ఛాత్రోపాధ్యాయుల కేరింతలు, చప్పట్లతో మార్మోగింది. ఛాత్రోపాధ్యాయులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సినీ, జానపద గీతాలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు స్నేహభావంతో మెలగాలని, కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. లెక్చరర్లు స్వర్ణకుమారి, విజయరావు, విజయలక్ష్మి, గంగామణి, అఫ్రోజ్, షహెనాజ్, సూపరింటెండెంట్ మమత, అక్బర్, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి


వివరాలు నమోదు చేస్తున్న ఐలమ్మ

ఆదిలాబాద్‌రూరల్: మహిళ సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చేందేందుకు శ్రీనిధి పథకం ద్వారా తక్కువ వడ్డీతో రుణాలు అందించడం జరుగుతుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని శ్రీనిధి జిల్లా మేనేజర్ ఐలమ్మ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని లాండసాంగ్వి గ్రామంలోని పలువురు స్వయం సహాయక సంఘాల సభ్యులకు శ్రీనిధి రుణాలు అందజేశారు. కార్యక్రమంలో లాండసాంగ్వి మహిళ సంఘం గ్రామ అధ్యక్షురాలు లలిత, గ్రామ వీవోఏ రజిత, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు.

బజార్‌హత్నూర్: స్వయం సహాయక మహిళ సంఘాలకు అందిస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రహ్లాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 19 ఎస్‌హెచ్‌జీ మహిళ గ్రూప్‌లకు రూ.1.30 కోట్ల బ్యాంకు లింకేజీ రుణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం గణేష్, ఫీల్డ్ ఆఫీసర్ రామకృష్ణ, సీసీ తొట్ల శంకర్, పురుషోత్తం, నారాయణ, గంగయ్య, సంతోష్, జమున పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నేరడిగొండ: బోథ్ ఎక్స్‌రోడ్ నుంచి చించోలి వెళ్తున్న రోడ్డులో గల హనుమాన్ ఆలయం కల్వర్టు వద్ద పెద్ద గుంత ఏర్పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. గమనించిన జిల్లా హ్యూమన్‌రైట్స్ ప్రతినిధులు మంగళవారం ప్రమాద స్థలం అని ప్రయాణికులకు తెలిసేలా కర్రలు పాతి రిబ్బన్ కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారులు ప్రమాద స్థలాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు రమణ, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమృత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

క్షీరాభిషేకం

నేరడిగొండ: కేంద్ర ప్రభుత్వం మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంపై మంగళవారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు గజ్జల శంకర్ మాదిగ, గోనె ఆడేళ్ల మాదిగ, గజ్జల అశోక్, కొత్తపల్లి రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కృష్ణపల్లి మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి బాధిత కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు.

జాతీయస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలికలు) మౌనిక 9వ తరగతి, ఆత్రం జ్యోతిక 8వ తరగతి విద్యార్థినులు జాతీయ స్థాయి సైన్స్ ఫేయిర్‌లో ప్రతిభ కనబరిచారు. కాగా.. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా విద్యార్థినులను శాలువాతో సత్కరించారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని లాండసాంగ్వి, అర్లి (బి) ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో కంటె నర్సయ్య మంగళవారం సందర్శించారు. ఆయా పాఠశాలలను సందర్శించిన ఆయన బోధన విధానాన్ని, పాఠశాలలోని రికార్డులను, ఉపాధ్యాయుల, విద్యార్థులు హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

విద్యతోనే భవిష్యత్

నేరడిగొండ: విద్యతోనే మంచి భవిష్యత్ ఉంటుందని తర్నం(కె) గ్రామ యువసేన యూత్ మండల అధ్యక్షుడు రమేశ్ అన్నారు. మంగళవారం తర్నం (కె) ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతలు వేర్వేరుగా ఎస్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించారు. గడుగు నరేందర్, చౌటుపల్లి వెంకటేశ్, మలపతి జగదీష్, అశోక్, ఆకాష్ పాల్గొన్నారు.

దర్బార్‌కు తరలిరండి

ఆదిలాబాద్‌రూరల్: ఫిబ్రవరి 2న ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి వద్ద ఏర్పాటు చేయనున్న దర్బార్‌కు పెద్ద ఎత్తున తరలిరావాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధి ఉద్యోగుల సాంకేతిక సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పాలపల్లె రాజు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు తరలివచ్చి తమ హక్కులపై గళమెత్తాలని పేర్కొన్నారు.

‘కేంద్ర మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం’

ఆదిలాబాద్‌రూరల్: ప్రజా యుద్దనౌక గద్దర్‌పై కేంద్ర మంత్రి బండిసంజయ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అంబేడ్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న, కార్యనిర్వాహక అధ్యక్షులు నల్లంటి నవీన్, ప్రధాన కార్యదర్శి దర్శనాల నగేశ్‌లు ఒక మంగళవారం ప్రకటనలో అన్నారు.